# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1





సంపుటి : 1 సంచిక : 366 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 24-12-2025 పేజీలు : 12 వెల రూ.3/


## నేనున్నంత కాలం..నీకు అధికారం కల్లే

-రాష్ట్రంలో బిఆర్ఎస్, కెసిఆర్ ఇక గత చరిత్రే

-కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు

-వరుస ఓటములు ఎదురయినా సిగ్గురాలేదా

-నన్నూ..నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినా పట్టించుకోలే

-కేసులు పెట్టి జైలుకు తోసినా లాభం లేదని మిన్నకున్నా

-ఫామ్‌హౌజ్‌నే జైలుగా మార్చుకుని ఉంటున్నావని గుర్తుంచుకో

-నీలా పాస్‌పోర్టు బ్రోకర్ దందా చేసి పైకి రాలేదు

-సొంత చెల్లిని మెడబట్టి గెంటిన కెటిఆర్ నాపై విమర్శలా

-నీలాంటి వారిని చాలామందిని చూసా..గుర్తుంచుకో

-కిందిస్థాయి నుంచి వచ్చి సిఎంగా అయ్యా

-కొడంగల్ సభలో కెసిఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన రేవంత్



## సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభవార్త

●పెద్ద పంచాయితీలకు పది, చిన్నవాటికి 5 లక్షల నజరానా ●నేరుగా విడుదల చేస్తానని ప్రకటన ●గ్రామాల అభివృద్ధికి నడుం బిగించాలని పిలుపు ●గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సూచన ●కేంద్రం నుంచి మార్చిలోగా 3వేల కోట్లు వస్తాయని వెల్లడి ●కొడంగల్‌లో సర్పంచ్‌ల సన్మాన కార్యాక్రమంలో రేవంత్ వెల్లడి

గ్రామాల అభివృద్ధికి కొత్త సర్పంచ్‌లు తమవంతుగా కృషి చేయాలని, వారికి ప్రభుత్వం తోడ్పాటుగా ఉంటుందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఎన్నికైన -మిగతా2లో



## 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే మొదటి ప్రాధాన్యత అని స్పష్టీకరణ
- పది సూత్రాలను పది మిషన్లుగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం
- నీటి భద్రత, వ్యవసాయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- 'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేయాలని దిశానిర్దేశం

**అమరావతి**

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా స్వీకరించి పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును తెలిపే ప్రత్యేక సూచికలను (ఇండికేటర్లు) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ ఆయన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 మిగతా 2లో

## నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు



-రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

-కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకం

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజనరీ నేత

-టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్

రాష్ట్రంలో అత్యధిక కాంగ్రెస్ సర్పంచులు నిజామాబాద్ జిల్లాలోనే గెలుపొందారని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకంగా ఉంటాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క జీవోను కూడా బహిర్గతం చేయలేదన్నారు. -మిగతా2లో



## ఎక్స్‌లో ఏపీ, తెలంగాణ టాప్ ట్రెండ్స్...



- పవన్ సాయం, రేవంత్ నిధులపై నెటిజన్ల చర్చ
- ఇప్పటం గ్రామ బామ్మకు పవన్ కల్యాణ్ వ్యక్తిగత ఆర్థిక సాయం
- గ్రామ పంచాయతీలకు రేవంత్ రెడ్డి ప్రత్యేక అభివృద్ధి నిధుల ప్రకటన
- గత వైసీపీ పాలనపై ఆలయ బంగారం కుంభకోణం ఆరోపణలు
- కేసీఆర్ కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర రాజకీయ విమర్శలు
- రెండు రాష్ట్రాల్లోనూ సంక్షేమం, అభివృద్ధిపై విస్తృతంగా సాగుతున్న చర్చ

## ఇస్రో ప్రయోగంతో బలమైన పునాదులు



అంతరిక్షంలో ప్రపంచసహకారంతో ముందుడుగు ఇస్రోకు ప్రధాని మోడీ అభినందనలు.. చంద్రబాబు, లోకేశ్ అభినందనల

శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం ప్రయోగించిన బాహుబి రాకెట్ ఎల్‌వీఎం3- ఎం6 ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2 ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై దేశంలోని పలువురు ప్రముఖులు -మిగతా2లో

## హెచ్-1 వీసా ఫీజుపై కోర్టులో సవాల్



హెచ్-1బి వీసాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన లక్ష డాలర్ల భారీ ఫీజును సవాలు చేస్తూ యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వేసిన దావాను ఫెడరల్ జడ్జి మంగళవారం తిరస్కరించారు. ఇది వలసల నియంత్రణపై అధ్యక్షుని విస్తృత అధికారాల పరిధి కిందకు వస్తుందని అన్నారు. -మిగతా2లో

## సంక్రాంతికి గ్రామాల్లో అన్న క్యాంటీన్లు



- గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి కానుకగా ప్రారంభం కానున్న 70 అన్న క్యాంటీన్లు
- జనవరి 13 నుంచి 15 మధ్య క్యాంటీన్లు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం
- పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే కొనసాగుతున్న 205 క్యాంటీన్లు




## 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

లక్షల ఉద్యోగాల కల్పనే అత్యంత ప్రాధాన్యతాంశమని స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని అంచనా వేయాలని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. నీటి భద్రతను కీలక మిషన్‌గా పరిగణించి, నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి ఆడిట్ నిర్వహించాలని, వివాదాలకు తావులేకుండా చూడాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. 'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించాలని, అరకు కాఫీ తరహాలో రాష్ట్ర ఉత్పత్తులకు నాణ్యతతో కూడిన గుర్తింపు తీసుకురావాలని సీఎం సూచించారు. రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్, స్వచ్ఛాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీ, సాంకేతికత వినియోగంతో పౌర సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖ ఆఫీస్ అటెండర్‌కు రూ. కోటి ఆస్తులు..

విశాఖపట్నం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఎంత లోతుగా పాతుకుపోయిందో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) సోదాల్లో బయటపడుతోంది. నవంబర్ నెలలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దర్యాప్తులో భాగంగా నిన్న ఏసీబీ అధికారులు పలువురు ఉద్యోగుల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సూపర్‌బజార్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఆనంద్‌కుమార్ ఇంట్లో ఏసీబీ అధికారులు సుమారు రూ. కోటి విలువైన స్థిర, చరాస్తులను గుర్తించి షాక్‌కు గురయ్యారు. ఒక అటెండర్ స్థాయిలో పనిచేసే వ్యక్తి ఇంత భారీ ఆస్తులు ఎలా కూడబెట్టాడనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుధారాణి నివాసంలోనూ దాదాపు కోటి రూపాయల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు.

## ఇస్రో ప్రయోగంతో బలమైన పునాదులు

-మొదటిపేజీ తరువాయి: ఇది ప్రభావ వంతంగా మారుతోందని ఆయన ఆకాంక్షించారు. ఎల్‌వీఎమ్ 3 నమ్మకమైన హెవీ లిఫ్ట్ పనితీరును కనబరుస్తుందన్నారు. గగన్‌యాన్ వంటి భవిష్యత్ మిషన్ల కోసం బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. అలాగే వాణిజ్య ప్రయోగ సేవలను సైతం విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాల సామర్థ్యంతోపాటు స్వావలంబను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. శ్రీహరికోట నుంచి ఎల్‌వీఎమ్3- ఎమ్6ను బుధవారం ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఈ సందర్భంగా ఇస్రో బృందానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. యూఎస్ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్ 2 మోసుకెళ్లి.. అందుకు నిర్దేశిరచిన కక్ష్యలో ఈ ఉపగ్రహం ఉంచిందన్నారు. భారత్ నేలపై నుంచి ఇప్పటి వరకు అత్యంత బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించ లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాజాగా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా మన దేశ వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం, ప్రపంచ ప్రయోగ భాగస్వామిగా దాని స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ అద్భుతమైన మిషన్ విజయానికి దోహదపడిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఇలా ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. బాహుబలి రాకెట్ అని పిలువబడే ఎల్‌వీఎమ్3 - ఎమ్ రాకెట్‌ను శ్రీహరికోట నుంచి ఈ రోజు విజయవంతంగా ప్రయోగించినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లోని శాస్త్రవేత్తలు, సిబ్బందికి రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి లోకేశ్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భారతదేశ వాణిజ్య ప్రయోగ సామర్థ్యాలను ప్రపంచం ఎదుట ప్రదర్శించడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. రానున్న రోజుల్లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించుకోవాలని కోరుకుంటున్నట్లు మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

## హెచ్-1 వీసా ఫీజుపై కోర్టులో సవాల్

-మొదటిపేజీ తరువాయి: ఈ రుసుము సమాఖ్య వలస చట్టానికి విరుద్ధంగా ఉందని, దీంతో పలు కంపెనీలు, ఆస్పత్రులు, ఇతర యజమానులు ఉద్యోగాలను, ప్రజలకు అందించే సేవలను తగ్గించుకోవాల్సి వస్తుందన్న యుఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ వాదనలను వాషింగ్టన్ డిసిలోని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి బెరిల్ హోవెల్ తోసిపుచ్చారు. విధాన నిర్ణయం చట్టబద్ధతను అంచనా వేయడం మాత్రమే కోర్టు పరిధిలో ఉందని, దాని అర్హతను నిర్ణయించడం కాదని జడ్జిహోవెల్ పేర్కొన్నారు. విధాన నిర్ణయం నిర్దేశించిన ప్రకటనలో వ్యక్తీకరించబడిన చర్యలు చట్టం పరిమితులకు లోబడి ఉన్నంతవరకు వాటిని సమర్థించాల అని అన్నారు. హెచ్-1బి వీసాలతో అమెరికా కార్మికులను స్థానభ్రంశం చేస్తుందనే తన వాదనకు ట్రంప్ తగిన మద్దతు ఇచ్చారని జస్టిస్ హోవెల్ పేర్కొన్నారు. హెచ్-1బి వీసాల కోసం వేలాది మంది అమెరికన్లను తొలగించిన కంపెనీలను కూడా ఉదహరించారని అన్నారు. జస్టిస్ హోవెల్‌ను అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా నియమించారు. చిన్న మరియు మధ్యతరహా వ్యాపారాలు ఈ రుసుమును భరించలేవని చాంబర్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు, చీఫ్ కౌన్సిల్ దారిల్ జోసెఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు నిర్ణయంతో తాము నిరాశ చెందామని అన్నారు. మరిన్ని చట్టపరమైన ఎంపికలను పరిశీలిస్తున్నామని అన్నారు. హెచ్1బి వీసా రుసుము పెంపుపై పలు కార్మికసంఘాలు, విద్యావేత్తలు, మతసంస్థలు కూడా కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు

-మొదటిపేజీ తరువాయి: సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా డీజీపీ ఎంపిక ఉండాలని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ప్యానెల్ లిస్టును యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాన్ని హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ టి. మధన్ గోపాల్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం జారీ చేసిన డీజీపీ నియామక ఉత్తర్వులు 2018 నాటి సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్ లైన్స్‌కు పూర్తి వ్యతిరేకమంటూ పిటిషనర్ వ్యక్తిగతం హాజరై ఈ కేసును హైకోర్టులో వాదించారు. డీజీపీ పదవి విరమణకు కనీసం 3 నెలల ముందుగానే యూపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ భర్తీ వివరాలను సమర్పించాల్సి ఉందన్నారు. అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దాంతో శాశ్వత నియామక ప్రక్రియ ఆగిందని వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌పై హైకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

# నేనున్నంత కాలం..నీకు అధికారం కల్లే

-మొదటిపేజీ తరువాయి: తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. మంతరిగా, కేంద్రమంత్రిగా, సిఎంగా పదేళ్లు పనిచేసిన కెసిఆర్ నాలుగు మంచి మాటలు చెప్పకుండా తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నీలాగా తిట్టుడు మొదలు పెడితే తట్టుకోలేవు కెసిఆర్ అంటూ హెచ్చరికలు చేశారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా అంటూ ఘాటైన విమర్శలు చేశారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పండబెట్టిన ఘనుడవని విమర్శించారు. స్థిరాస్తి వ్యాపారం దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితే పాతాళానికి వెళ్లారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసి పెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడించినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు. నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దాం.. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారని కేసీఆర్ , ఆయన కుటుంబంపై నిప్పులు చెరిగారు. అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడిన సీఎం, తనను , తన కుటుంబాన్ని గతంలో కేసీఆర్ వేధించారని, జైల్లో పెట్టి ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన చేసిన పాపాలే ఆయనను వెంటాడుతున్నాయి. జైల్లో పెట్టి ప్రభుత్వ ఖర్చుతో ఆయనకు తిండి పెట్టడం ఎందుకని నేను ఒక్క కేసు కూడా పెట్టకుండా వదిలేశాను. కానీ ఇప్పుడు సోయి లేకుండా మాట్లాడుతూ తోలు తీస్తా అని స్థాయి లేని మాటలు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిసవాల్ విసురుతూ, 'రా.. నీ చింతమడకకు రమ్మంటావా లేక కొడంగల్ వస్తావా? ఎక్కడైనా తేల్చుకుందాం. మటన్ కొట్టు మస్తాన్ దగ్గర పొట్టేలును కోసిన తర్వాత తోలు తీసే పని కేసీఆర్‌కు ఇమ్మని చెప్పాను. సాయంత్రం వెళ్లేటప్పుడు దావత్ కోసం ముక్కో బొక్కో ఇచ్చి పంపమని సూచించాను. నన్ను గెలికితే నేను మాట్లాడటం మొదలుపెడితే నువ్వు ఉరి వేసుకుని చస్తావు. మల్లన్న సాగర్‌లో పడి చావాల్సిందే అని అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే భయంతో సొంత బిడ్డను, అల్లుడిని వెళ్లగొట్టాడని, సొంత చెల్లెలిని పండుగకు కూడా ఇంటికి పిలవలేని వ్యక్తి తన గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. 'పిడకల మూతి బోడిలింగం లాంటి కేటీఆర్, నువ్వు, నీ జాతి అంతా వచ్చినా నేను భయపడను. మీ రాజకీయం ఏంటో చూపిస్తా, రాసి పెట్టుకో' అని సవాల్ విసిరారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి , ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభవార్త

-మొదటిపేజీ తరువాయి: ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. సర్పంచ్‌లకు శుభవార్త చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని చెప్పారు. పెద్ద గ్రామాలకు రూ. 10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ. 5 లక్షలు చొప్పున ఇస్తామన్నారు. సర్పంచ్‌లకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు ఇస్తామని సీఎం తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధం లేకుండా నిధులు ఇస్తామని తెలిపారు. అలాగే గ్రామాల్లో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తాని సీఎం ప్రకటించారు. కేంద్రం నుంచి 3వేల కోట్లు రావాల్సి ఉందని, మార్చిలోగా వాటిని తెచ్చే బాధ్యత తనదని, వాటిని నేరుగా గ్రామాలకు అందచేస్తామని అన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో పనులు మొదలు పెట్టాలన్నారు. మీ సహకారం వల్లే నేను ఇంతటివాడిని అయ్యాను. 2009 నుంచి నన్ను మీ భుజాలపై మోశారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది. గ్రామాల్లో వివక్ష లేకుండా పరిపాలన సాగాలి. పార్టీలు.. పంతాలకు పోకుండా కలిసికట్టుగా పనిచేయాలి. గ్రామాల అభివృద్ధికి పాటుపడేలా సర్పంచ్‌లు ఉండాలి. ప్రజలకు ఉన్నతమైన, నాణ్యమైన సేవలు అందించాలి. పార్టీలకు అతీతంగా గ్రామాలు అభివృద్ధి కావాలని నూతన సర్పంచ్‌లకు సీఎం రేవంత్ సూచించారు. నూతన సంవత్సరంలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు గ్రామాల్లో సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు. గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఉపయోగించాలన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ప్రతి గ్రామం, తండాకు రోడ్లు పూర్తి చేస్తాం. గుడి, బడి, తాగునీరు, పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తాం. నిరుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తాం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు.. గ్రామాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సేవ చేయాలి. దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. పేదలకు పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన అందుబాటులోకి వస్తుంది. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టిన నాయకులను అభినందిస్తున్నా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి మా సోదరుడు తిరుపతిరెడ్డిని అందుబాటులో ఉంచా. ఎన్నికలు ముగిశాయి.. ఇక ఎలాంటి రాజకీయాలు లేవు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలు, పంథాలు ఉండాలి. రాష్ట్రానికి నాయకత్వ వహిస్తున్న మనం అందరినీ కలుపుకొని పోదాం అని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల్లో ఎలాంటి సమస్యలు ఉండకూడదని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు

-మొదటిపేజీ తరువాయి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ.1.70 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ నోరు జారి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని మందలించారు. ఆయనలా దిగజారి తాము మాట్లాడమని చెప్పుకొచ్చారు. ప్రజలే కేసీఆర్ అండ్ కోకు బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా తాము దుర్వినియోగం చేయట్లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందించాలంటే విద్యుత్తు ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫామ్‌హౌస్‌లో కూర్చున్న కేసీఆర్ బయటకు వచ్చి విమర్శిస్తున్నారని ఫైర్ అయ్యారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత నేడు మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాము సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, బీమా పథకం అమలు చేస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# ఎక్స్‌లో ఏపీ, తెలంగాణ టాప్ ట్రెండ్స్...

**ఆంధ్రప్రదేశ్:**

క్రిస్మస్ పండుగ సమీపిస్తున్న వేళ, తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సోషల్ మీడియా వేదిక X (గతంలో ట్విట్టర్) రాజకీయ, సామాజిక అంశాలతో హోరెత్తుతోంది. 2025 డిసెంబర్ 24న ప్రభుత్వాల నిర్ణయాలు, సంక్షేమ పథకాలు, రాజకీయ నాయకుల పర్యటనలు, మాటల యుద్ధాలపై నెటిజన్లు విస్తృతంగా చర్చిస్తున్నారు. ఇరు రాష్ట్రాల్లోని ప్రజల ఆలోచనలకు, ప్రభుత్వాల ప్రాధాన్యతలకు అద్దం పడుతూ ట్రెండింగ్‌లో నిలిచిన ప్రధానాంశాలపై ఓ సమగ్ర విశ్లేషణ.

### ఆంధ్రప్రదేశ్: సంక్షేమం, అభివృద్ధి, మానవత్వంపై ఫోకస్

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య సంస్కరణలు, రాజకీయ నాయకుల వ్యక్తిగత పర్యటనలు ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పటం గ్రామంలో ఓ వృద్ధురాలిని పరామర్శించి, ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందించడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. సంక్రాంతి ఖర్చుల కోసం రూ.50 వేలు, తన జీతం నుంచి నెలవారీ సాయం అందిస్తామని ప్రకటించిన పోస్ట్ వైరల్ అయింది. ఇది మానవతా దృక్పథంతో కూడిన నాయకత్వానికి నిదర్శనమని పలువురు కొనియాడుతున్నారు. APTowardsGramaSwaraj వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి.

# వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం
- జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్





**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కేవిఆర్ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం-2025 సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించిన వినియోగదారుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.., డిసెంబర్ 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా జాతీయ వినియోగదారుల వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ప్రతి వ్యక్తి రోజువారి జీవితంలో వివిధ వస్తువులు, సేవలను వినియోగిస్తున్నందున వినియోగదారులు తమకు చట్టపరంగా కలిగిన హక్కులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని సూచించారు. నాణ్యమైన వస్తువులు, సరైన సేవలను పొందడం ప్రతి వినియోగదారుడి హక్కు అని తెలిపారు. లోపభూయిష్టమైన వస్తువులు లేదా నాణ్యతలేని సేవలు అందించిన సందర్భాలలో వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019 ప్రకారం సంబంధిత వినియోగదారుల ఫోరమ్‌లను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ కొనుగోళ్లు, డిజిటల్ లావాదేవీలు విస్తృతంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు సంబంధించిన బిల్లులు, రసీదులు, వారంటీ కార్డులు తప్పనిసరిగా భద్రపరచుకోవాలని, తప్పుడు ప్రకటనలు, ఆకర్షణీయ ఆఫర్లు, మోసపూరిత వ్యాపార విధానాల పట్ల జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్ హితవు పలికారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు చేపడుతున్నాయని, వాటిని ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. విద్యాసంస్థల ద్వారా వినియోగదారుల దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువతలో అవగాహన మరింత పెరుగుతుందని, భవిష్యత్‌లో బాధ్యతాయుత వినియోగదారులుగా వారు ఎదుగుతారని పేర్కొన్నారు. అనంతరం వినియోగదారుల హక్కులపై నిర్వహించిన వ్యాస రచన, ప్రశ్నోత్తర, పరీక్షా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జేసీ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి ఎం. రాజా రఘువీర్, డిఎం సివిల్ సప్లై వెంకట రాముడు, జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు నజ్మా కౌసర్,నారాయణ రెడ్డి, రీజనల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ లాలేప్ప, తూనికల శాఖ డిప్యూటీ కంట్రోలర్ దయాకర్ రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ ఫుడ్ సేఫ్టీ కూర్మనాయక్, అసిస్టెంట్ కమిషనర్ కమిషన్ టాక్స్ కైక, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, జిల్లా కార్యదర్శి వినియోగదారుల రక్షణ మండలి శివ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓంకారంలో సివిల్ కోర్టు న్యాయమూర్తి



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 24 :** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని నంద్యాల ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసులు బుధవారం సందర్శిం చారు. పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన న్యాయమూర్తికి ఆలయ దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసులు స్వామివారికి పంచామృత అభిషేకం అమ్మవారికి కుంకు మార్చన పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవ స్థానం చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఆలయ నిర్వహణ అధికారి నాగ ప్రసాద్ అర్చకులు చక్రపాణి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మిగనూరు జిల్లా కేంద్రం గా ప్రకటించాలి



**నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 24 :** ఎమ్మిగనూరు జిల్లా సాధన ఆధ్వర్యంలో నందవరం మండలం లో ధర్నా నిర్వహించడం తో విశేష స్పందన లభించింది అని జేఏసీ నాయకులు రంగయ్య తెలిపారు. ఆదోని జిల్లా కి మేము అడ్డు కాదని అన్ని అర్హతలు ఉన్న యెమ్మిగనూరు ను జిల్లా చేయాలనీ డిమాండ్ చేశారు. కేవలం కొంతమంది రాజకీయ లబ్ది కోసం యెమ్మిగనూరు ప్రజల మనోభావాలను దెబ్బతిస్తున్నారని అభివ ృద్ధి కి అడ్డుకట్ట వేస్తున్నారని ఇక్కడ ఓట్లు సీట్లు మాత్రమే కావాలి అభివ ృద్ధి వద్దని పరోక్షంగా తెలియజేస్తున్నారని ఇది ప్రజలు గమనించాలని తెలిపారు. జిల్లా చేయాల్సి వస్తే భూములు యెమ్మిగనూరు జిల్లా ఆదోని కాకుండా జిల్లా గా యెమ్మిగనూరు ను ప్రకటించి ఆదోని ప్రాంతం ని అన్ని రకాలుగా అభివ ృద్ధి చేయాలనీ డిమాండ్ చేశారు. ఆదోని ప్రాంతం సెంటర్ అంటే యెమ్మిగనూరు రెండు రాష్ట్రాల సరిహద్దులకు సెంటర్ అని తెలిపారు. ఎలాంటి మత ఘర్షణలకు చోటు లేకుండా శాంతి కి నిలయం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లోనే తక్కువ క్రైం ఉన్న నియోజకవర్గం యెమ్మిగనూరు అని తెలిపారు.అలాగే జేఏసీ నాయకులు రాజేష్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు జిల్లా కేంద్రం అయితే ప్రక్కన ఆదోని,మంత్రాలయం మరియు కర్నూలు నగరం ఒక కారిడార్ చేస్తూ ఒక పెద్ద నగరం ఏర్పడుతూ అన్ని రకాల రవాణా వ్యవస్థ ఏర్పడుతుందన్నారు ప్రభుత్వం కి ఖర్చు తగ్గడానికి అన్ని వసతులు పాత భవనలు నిర్మితం అయి ఉన్నాయి అని తెలిపారు. ఐదు నియోజకవర్గలు అభివ ృద్ధి జరగాలి అనే డిమాండ్స్ తో ఉద్యమం ఉద ృతం చేస్తామని తెలిపారు. జేఏసీ నాయకుడు చిన్ని ప్రసాద్ మాట్లాడుతూ యెమ్మిగనూరు జిల్లా పై ప్రజాప్రదినిధులు స్పష్టమైన సమాధానం చెప్పకపోతే రోడ్లపై తిరగనీయం అని ఇది లక్షల మంది ప్రజల కోరిక అని వారి మనోభావాలతో ఆడుకోవద్దని హెచ్చరించారు.కార్యక్రమం లో నాయకులు లక్ష్మణ్ పరమేష్ రాజోలుప్ప రామ్ శివ నాని శ్రీను తిమప్ప నందవరం ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా టీడీపీ నూతన అధ్యక్షురాలు గుడిసె క ృష్ణమ్మ బాధ్యత స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు






**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవుల కేటాయింపుల్లో పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి టీడీపీ బీసీల పార్టీ అని మరో సారి రుజువు చేసారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు...కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్ లో గల జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా టీడీపీ అధ్యక్షురాలుగా గుడిసె కృష్ణమ్మ బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు..ఈ సందరరేగా ఎంపీ నూతన అధ్యక్షురాలు క ృష?మ్మకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు...అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక శాతం బీసీలు ఉన్న కర్నూలు జిల్లాలో అధ్యక్ష పదవి బీసీ కి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు... తెలుగుదేశం పార్టీలోనే బీసీ లు, మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు..క ృష?మ్మ అధ్యక్షతన జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించిన ఆయన, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరు సమిష్టిగా క ృషి చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కే.ఈ ప్రభాకర్, మాజీ టీడీపీ జిల్లాలో అధ్యక్షలు తిక్కారెడ్డి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డి.ఎస్.ఏం.ఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మాజీ ఎం.ఎల్.ఏ మీనాక్షి నాయుడు, మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా అధ్యక్షురాలుగుడిసె కృష్ణమ్మకి శుభాకాంక్షలు

## - బిజెపి నాయకులు దేశాయ్ గురురాజ్




**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 24 :** తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన గుడిసె కృష్ణమ్మకి ఎమ్మిగనూరు బిజెపి నాయకులు ఆత్మ నిరార్ భారత్ ఎమ్మిగనూరు మరియు మంత్రలయం నియోజకవర్గం ఇంచార్జ్ గురురాజ్ దేశాయ్ స్వామి, 21 వార్డ్ కౌన్సిలర్ దయాసాగర్, బిజెపి సీనియర్ నాయకులు లలిత్ జైన్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కష్టపడిన వారికి తప్పకుండా న్యాయం చేస్తారని మరొక్కసారి రుజువుచేశారు. కూటమి నియమనిబంధనల ప్రకారం జిల్లలో అన్ని నియోజ కవర్గాలలో బిజెపి పార్టీ నాయకులకు కార్యకర్తలకు సమ న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదోని బిజెపి కౌన్సిలర్లు మధుసూదన్ శర్మ , 02 వ వార్డు కౌన్సిలర్ సురేష్ , సినియర్ బిజెపి నాయకులు నారాయణ, నందవరం మాజీ సర్పంచ్ ఎల్ సి ఛైర్మన్ రామన్న గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉప్పర రామ్ చరణ్, మండల ప్రధాన కార్యదర్శి కురువ బడేసాబ్, నందవరం మండలం బిజెపి సినియర్ నాయకులు కె శివ పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి






**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశంలో మరల ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు..బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ గారితో కలిసి జిల్లా కలెక్టర్ డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్ గా గుర్తించిన రహదారి ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడింగ్, రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్, ఇల్యూమినేషన్ లైటింగ్ ఏర్పాటు చేయాలని గత సమావేశంలో చెప్పామని, అయితే నేషనల్ హై వే అనంతపురం స్ట్రెచ్ లో ఇంకా పనులు జరగలేదని, వెల్దుర్తి వరకు సైన్ బోర్డ్స్, ఇల్యూమినేషన్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ నేషనల్ హై వే అనంతపురం పిడి ని ఆదేశించారు..నేషనల్ హై వే స్ట్రెచ్ లలో మీడియన్స్ నిర్వహణ సరిగ్గా లేదని, మొక్కలను కట్ చేయకుండా అలాగే వదిలేశారని, మీడియన్స్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు.. అదే విధంగా పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్లలో బ్లైండ్ కర్వ్ లు ఉన్న చోట ఇంకా బుష్ క్లియరెన్స్, ఎండిపోయిన చెట్లు అలాగే ఉన్నాయని, మంత్రాలయం, కోసిగి ప్రాంతాలకు వెళ్లినప్పుడు గమనించానని, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి ఎస్ఈ లను ఆదేశించారు..ఎల్లమ్మ దేవాలయం దగ్గర జరుగుతున్న అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేశారని, వాటికి సంబంధించిన బిటి రోడ్ పనులను కూడా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు...రాళ్లదొడ్డి వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి నిధులు మంజూరు అయినందున, పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్ అండ్ బి ఎస్ఈ ని ఆదేశించారు..ఎన్ హెచ్ 340 సి కి సంబంధించి నందికొట్కూరు రోడ్డు లో చేపడుతున్న పనులను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ కర్నూలు ఆర్డీఓ, ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..కిడ్స్ వరల్డ్ నుండి కలెక్టరేట్ కాంప్లెక్స్ వరకు చేపట్టనున్న రోడ్ విస్తరణ పనులను ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కెపాసిటీకి మించి ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఈ అంశంపై డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి, కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు... ఉల్చాల జంక్షన్ అభివృద్ధి పనులను జనవరి చివరి నాటికి, గాయత్రి ఎస్టేట్ జంక్షన్ అభివృద్ధి పనులను జనవరి 12 వ తేదీ నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అదే విధంగా నగరంలో జరుగుతున్న ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు..హిట్ అండ్ రన్ కి సంబంధించి బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాల్సిన కేసులు కర్నూలు ఆర్డీఓ వద్ద ఎక్కువ పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు..జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ నేషనల్ హై వే అనంతపురం స్ట్రెచ్ లో సైన్ బోర్డ్స్, ఇల్యూమినేషన్ లైటింగ్ వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ నేషనల్ హై వే అనంతపురం పిడి ని ఆదేశించారు... స్టేట్ హైవే %ఆ% నేషనల్ హైవే అప్రోచ్ రోడ్ లకి సంబంధించి స్పీడ్ బ్రేకర్ లు వేసే పనులు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు..సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, కర్నూల్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ కృష్ణ?, ఆర్డీవో భరత్, ఎన్ హెచ్ కడప పిడి అశోక్ కుమార్ , ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఎన్ హెచ్ కర్నూలు, అనంతపురం పిడి తరుణ్ కుమార్, నేషనల్ హైవే ఎస్ డి సి సునీత, పంచాయతీ రాజ్ ఎస్ ఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు..

# పూజ ద్రవ్యాలతో వాజపేయి చిత్రం

## -చిత్రకారుడు చింతలపల్లె కోటేష్





**నంద్యాల . డిసెంబర్ 24 . (పల్లె వెలుగు ):**నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజపేయి జయంతిని మరియు అటల్ సుపరి పాలనాయాత్ర, శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలు పురస్కరించుకొని పసుపు, కుంకుమ, గంధం, సింధూరం వంటి పూజ ద్రవ్యాలను నీటిలో కలుపుకొని చార్ట్ మీద ఆ మహనీయుని చిత్రాన్ని వేసి చిత్ర నివాళులు అర్పించారు. రెండు గంటల సమయంలో ఈ చిత్రాన్ని వేసారన్నారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ వాజపేయి గారు నీతి గల రాజకీయ నాయకులు, జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప నేత. డిసెంబర్ 25-1924 న ఆయన పుట్టినరోజు. ఆయన శత జయంతి సందర్భంగా అటల్ సూపరిపాలన దినంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఆ మహనీయుని సేవలు కొనియాడుతూ ఆయన విగ్రహాలు ప్రతిష్ట చేసి ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. భరతమాత ముద్దు బిడ్డ, బహుముఖ ప్రజ్ఞశాలి, మహోన్నత మహామనిషి, ఆయన ప్రధానిగా వున్నప్పుడు మంచి పరిపాలన అందించారు. వాజపేయి బ్రహ్మచారి. దేశ సేవకై అంకితమైన కారణజన్ముడు. ఎంతో పవిత్రమైన ఆ మహానాయకునికి, ఎంతో పవిత్రమైన హిందూ సంప్రదాయాలలో పూజకు ఉపయోగించే పసుపు, కుంకుమ, గంధం, సింధూరం వంటి పూజ ద్రవ్యాలతో ఆ మహనీయుని చిత్రం వేసి నివాళ్లు అర్పించాను. జై వాజపేయి.... జై జై వాజపేయి.

# హబీబ్ ఎక్స్పోర్ట్ షాప్ సీజ్ కేసు నమోదు

## - ఫుడ్ ఇన్స్పెక్టర్ లు వెంకటరాముడు, ఖాసిం వలి.









**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. :** నంద్యాల పట్టణంలోని స్థానిక పద్మావతి నగర్ లో ఉన్న హబీబ్ ఎక్స్పోర్ట్ షాప్ ను ఫుడ్ ఇన్స్పెక్టర్ లు వెంకటరాముడు , ఖాసిం వలి తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్లు మాట్లాడుతూ వారికి రాబడిన సమాచారం మేరకు పద్మావతి నగర్ లో ఉన్న మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఎదురుగా హబీబ్ ఎక్స్పోర్ట్ షాపును తనిఖీ చేయగా కాలం చెల్లిన ఫుడ్ ఐటమ్ దొరికాయి అని అన్నారు. షాపులో 8 రకాల కాలం చెల్లిన ఫుడ్ ఐటమ్ దొరికాయని , 8 రకాల ఫుడ్ ఐటమ్ సీజ్ చేసి జెసి ముందర హాజరు పరుస్తున్నట్లు అన్నారు. జిల్లాలో 2023 నుండి ఇప్పటివరకు సుమారు 120 కేసులు నమోదు చేశారని అన్నారు. వాటిలో 35 కేసులు పరిష్కారం కాగా ప్రభుత్వానికి 14 లక్షల 80 వేల రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇంకా 35 కేసులు వివిధ రకాల కోర్టులో ఉన్నాయని అన్నారు. ఒక పది కేసులు ఫుడ్ కమిషనర్ దృష్టిలో ఉన్నాయని అన్నారు. ఇంకా 43 కేసులు త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నంద్యాల జిల్లాలో ఏ షాపులలైనా కాలం చెల్లిన వస్తువులు కనపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించింది లేదని, వారిపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని జిల్లా ప్రజలకు హెచ్చరించారు. జిల్లాలో ఫుడ్ ఇన్స్పెక్టర్లు మమ్మరంగా తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్పెక్టర్ లతోపాటు కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి సాగు చేస్తే చట్ట ప్రకారం శిక్షలు తప్పవు



**– జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**
**– గంజాయి తో పట్టుబడితే మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష**
**– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** జిల్లాలో గంజాయి సాగుచేసినా, గంజాయితో పట్టుబడినా చట్ట ప్రకారం శిక్షలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎస్.పి. విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు.బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ కానారేన్స్ హాల్ లో మాదకద్రవ్యాల నియంత్రణ కు సంబంధించి జిల్లా సమన్వయ కమిటీ (ఎన్కార్డ్) సమావేశం జరిగింది.ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ అధికారుల ఉద్దేశించి మాట్లాడుతూ...జిల్లా లో ఎక్కడా గంజాయి సాగు చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయాల అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్ లు గంజాయి సాగు పై గట్టి నిఘా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, రైతు సేవా కేంద్రాలలో గంజాయి సాగు చేయడం చట్ట ప్రకారం నేరం అన్న విషయంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు.. డీఅడిక్షన్ సెంటర్ లో సిబ్బందిని నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కర్నూలు నగరంలో ఉన్న 48 పార్కులలో లైట్లు ఏర్పాటు చేయాలని, సంకల్ బాగ్ , కల్లూరు , చిన్న బ్రిడ్జి తదితర ప్రదేశాలలో చీకటి లేకుండా, పెరిగిన చెట్లను తొలగించి వెలుతురు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో గోడల మీద పర్మనెంట్ గా ఉండేలా సందేశాన్ని వారం లోపు పెయింటింగ్ చేయించాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... కాలేజీలు , పాఠశాలల్లో మత్తు పదార్థాలను తీసుకోకూడదనే సందేశంతో హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే 1972 టోల్ ఫ్రీ నెంబర్ గురించి ప్రచారం చేయాలని కాలేజీ యాజమాన్యాలను ఆదేశించారు. మత్తు పదార్థాల సేవనాన్ని గుర్తించే టెస్టింగ్ కిట్లను వెంటనే తెప్పించాలని జీజీహెచ్ అధికారులను ఆదేశించారు. పత్తికొండ, నందవరం, ఎమ్మిగనూరు, చిప్పగిరి తదితర మండలాల్లో గంజాయి సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మత్తు పదార్థాలను సేవించిన వారిని డి అడిక్షన్ సెంటర్కు తరలిస్తామని, గంజాయి సాగు చేయడం కానీ, మత్తు పదార్థాలను సేవించడం, కలిగి ఉండడం నేరమని, ఈ అంశాలకు సంబంధించి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని, ఆ విషయాన్ని బాగా ప్రచారం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.ఈగల్ టీం సభ్యులు సుజన్ కుమార్ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ పై చేపట్టిన చర్యలపై అధికారులకు వివరించారు.ఈ సమావేశానికి ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ సుధీర్ బాబు , జెడి అగ్రికల్చర్ వరలక్ష్మి , ఆర్టీసీ ఆర్ఎం వెంకటేశ్వర్లు , డిఎంహెచ్వో భాస్కర్ , సీఈవో సెట్కూరు వేణుగోపాల్ , సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాధిక , మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహ పర్వీన్ , డి ఈ ఓ సుధాకర్ , లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు , క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అక్తర్ భాను , మెప్మా పీడీ శ్రీనివాసులు , డి వి ఈ ఓ ,మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్లు, ఏ డి డ్రగ్స్ కంట్రోల్ , కర్నూలు మున్సిపల్ అధికారులు , ఈగల్ టీం సభ్యులు , కాలేజీల అధికారులు మరియు వీడియో కానారేన్స్ ద్వారా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాల అకాడమీ పాఠశాల నందు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




**పల్లె వెలుగు నంద్యాల రూరల్. :** నంద్యాల పట్టణంలోని స్థానిక పార్క్ రోడ్డు సమీపంలో గల బాలా అకాడమీ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఈరోజు అనగా 24/12/2025బుధవారము రోజున జరుపుకోవడం జరిగింది. చిన్నారులు క్రిస్మస్ వేడుకలలో భాగంగా శాంటా క్లాస్, ఏంజెల్స్,తూర్పు దేశపు జ్ఞానులు లాగా,మేరి,జోసఫ్ గొర్రెల కాపరుల వేషధారణలో వచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. జి.వి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత మాట్లాడుతూ క్రిస్మస్ పండుగలోని ముఖ్య ఉద్దేశం తెలుసుకున్నారు. క్రిస్మస్ క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ అని ఏసుక్రీస్తు పుట్టిన రోజులు ఈరోజు జరుపుకుంటారు. ఏసు క్రైస్తవ మత మూలపురుషుడు ఈయన సాధారణంగా ఏసుక్రీస్తు గా కూడా వ్యవహరించబడతాడు. ఇందులో క్రీస్తు అన్న పదం గ్రీకు భాషలో క్రీస్తోస్ అంటే అభిశక్తుడు అనే అర్థం వచ్చే పదము నుండి పుట్టింది పాపం చేసిన వాడికి శిక్ష విధించడం కాదు పాపమే మరణించాలి అలా జరిగితే పాపం లేని మనిషి పాప రహితుడై యేసు క్రీస్తులా మారతాడని దేవుని నమ్మకం అందుకే నశించిన దాన్ని వెతికే రక్షించే నిమిత్తం ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపాడని విశ్వసిస్తారు. ఏసుక్రీస్తు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం వెలసింది. ముగ్గురు జ్ఞానులు ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్లి బాల యేసును దర్శించి ఆనంద భరితులయ్యారు. ఆ గుర్తుగా వారు బాలయేసునకు కానుకలను సమర్పించారు. అవి బంగారం గోలము, పరిమళ సాంబ్రాణి వారు సమర్పించిన బంగారం క్రీస్తు ప్రభువు పరిశుద్ధతకు పవిత్రతకు చిహ్నంగా కనబడుతుంది. అందరూ ఒకరి పట్ల మరొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండటం ద్వేషాన్ని విడనాడటం క్రిస్మస్ పర్వదిన ప్రాముఖ్యమని తెలిపారు. క్రైస్తవ మతస్తులందరికీ మిత్రులకి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీలత ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కంది కొనుగోలు నిర్ణయానికి స్వాగతం

**– అన్ని ఆరుతడి పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి**
**– బొజ్జా దశరథరామిరెడ్డి**



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** కంది పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ముందుకు రావడాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి స్వాగతించారు. ఈ సందర్భంగా బుధవారం నంద్యాల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో బొజ్జా మాట్లాడుతూ కందులు, పెసలు, మినుములు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వ్రాసిన ఉత్తరానికి స్పందించి, కేంద్ర ప్రభుత్వం కందుల కొనుగోలుకు ముందుకు రావడం అభినందనీయం అని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్ సి సి ఎఫ్) ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 40 వేల టన్నుల కందుల కొనుగోలుకు నిర?యం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల్లో కంది సాగు జరగగా, దాదాపు 1,60,000 టన్నుల ఉత్పత్తి జరిగే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుత నిర?యం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కంది ఉత్పాదనలో సుమారు 25 శాతం మాత్రమే కొనుగోలు జరిగే పరిస్థితి ఉంటుందని అన్నారు. ఇది ఒక ఆరంభమే అయినప్పటికీ, 40, 000 టన్నుల కొనుగోలు తర్వాత కూడా మార్కెట్లో ధరల స్థిరీకరణ జరగకపోతే మరింత కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలి అని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం కోస్తా ప్రాంతంలో పండిన "వరి" పంటను పూర్తిగా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్టుగానే, రాయలసీమలో మొక్కజొన్న, శనగ, కంది, మినుము, పెసలు, జొన్నలు, చిరుధాన్యాలు సహా అన్ని ఆరుతడి పంటలను కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులను ప్రోత్సహిస్తున్న సందరరేలో, ఆరుతడి పంటలకు కనీస మద్దతు ధర హామీ ఇవ్వడం అత్యవసరం.. రైతులు వరి నుండి ఆరుతడి వైపు మళ్లాలంటే, వారు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఖచ్చితంగా లభిస్తుందనే నమ్మకం కల్పించాలని సూచించారు.రాష్ట్రంలో పండించిన మొక్కజొన్న కనీస మద్దతు ధర కంటే సుమారు ?600 తక్కువ ధరకు అమ్ముడవుతున్నా ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించలేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. అలాగే రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో వేలాది టన్నుల శనగలు గోడౌన్లలో నిల్వ ఉండిపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ ఇంత నిలవలు ఉన్నా ఈ పంటలను కనీస మద్దతు ధరకు కొనే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వెల్లబుచ్చారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన వివరించారు. ఇప్పటికైనా ఈ పంటలపై ప్రభుత్వం ప్రత్యేక ద ృష్టి నిలపాలని కోరారు.

కేవలం ప్రకటనలతో కాలయాపన చేయకుండా, సరైన సమయంలో, అవసరమైనంత పరిమాణంలో అన్ని ఆరుతడి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేలా తక్షణమే చర్యలు చేపట్టాలి అని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర రెడ్డి, ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 101 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**– సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్.**
**– సిపిఐ నంద్యాల పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ .**




**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. :** నంద్యాల సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ కౌన్సిల్ సభ్యుల సమావేశం సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి నాగ రాముడు సిపిఐ జిల్లా నాయకులు పి మురళీధర్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ సిపిఐ పట్టణ నాయకుడు ధనుంజయ్ హాజరు కావడం జరిగింది. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసి 101 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందరరేగా ఈనెల 26వ తారీఖున అన్ని శాఖలలో పతావిష్కరణలు గావించి పార్టీ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ఆవిరభావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భారత గడ్డపై ఎన్నో వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర ఉందని అన్నారు .భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తికై నిరంకుశ నైజాం నవాబులను గద్దె దించడానికి మహోత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ దని అన్నారు. ఇటువంటి ఘన చరిత్ర గల సిపిఐ నూట ఒకటవ ఆవిరావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ శాఖ కార్యదర్శిలు, సహాయ కార్యదర్శులు, సిపీఎం రమేష్, ప్రవీణ్, సాల మద్దిలేటి, మద్దయ్య, చాంద్ బాషా, శిక్షావలి, మా భాష, దానం, నాగార్జున, హుస్సేన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్.**



**మహానంది, పల్లె వెలుగు**

విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల శక్తి టీం సభ్యులు హెడ్ కానిస్టేబుల్ డీఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం తమ్మడపల్లె, బుక్కాపురం గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలల విద్యార్థినులకు గుడ్ బాడ్ టచ్ లపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థిని, విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల కలిగే దుష్పలితాల పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేయడం చెట్టరీత్యా నేరమని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వేధించిన, అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు గాని 112 నంబర్‌కు కాల్ చేస్తే వెంటనే పోలీసులు స్పందిస్తారన్నారు. శక్తి యాప్ ను ప్రతి ఒక్క విద్యార్థినీ తమ తల్లిదండ్రుల ఫోన్లో డౌన్లోడ్ చేసుకొని అత్యవసర సమయంలో సహాయం పొందాలని తెలిపారు.విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయుల మాట వింటే భవిష్యత్తు బాగుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు మహమ్మద్ రఫీ, వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్ మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మట్టి రోడ్డుని తలపిస్తున్న బీటీ రోడ్డు

**– రోడ్డు వెయ్యకపోయినాపర్వాలేదు ముళ్ళ పొదలనుతొలగించండి మహాప్రభో**



**దొర్నిపాడు డిసెంబర్ 24 పల్లె వెలుగు న్యూస్ :** కొన్ని రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ముళ్లపదలను తొలగించడంతో కొంతమేర ప్రమాదాలను నివారించవచ్చు, ఈ మలుపు ప్రమాదాలకు పిలుపుగా ఉన్న అధికారులు చూసి చూడనట్లు ఉన్నారు అనడానికి ఈ దారే నిదర్శనం, గుంతల మయంగా మట్టి రోడ్డు ను తలపించేలా ఉన్న ఈ బీటి రోడ్డు దొర్నిపాడు నుండి ఉయ్యాలవాడకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు , జిల్లా కేంద్రమైన నంద్యాల కు వెళ్లేందుకు ఆర్లగడ్డ నుండి ఉయ్యాలవాడ, దొర్నిపాడు మీదుగా యాల్లూరు నంద్యాలకు వెళ్లేందుకు ప్రభుత్వం రోడ్డును ఏర్పాటు చేసింది ,గత ప్రభుత్వం వేసిన తారు రోడ్డు గుంతలు ఏర్పడి మట్టి రోడ్డుగా మారింది, ఈ రోడ్డు ప్రయాణానికే కాకుండా రైతు లుపండించిన పంట ధాన్యాలను ఇండ్లకు చేరవేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంది రాత్రి వేళలో వాహన ప్రయాణం ప్రమాదకరంగా ఉందని ప్రజలు అంటున్నారు, రోడ్డు కు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లు ఉండడంతో వాహనాలపై వెళ్లే వారి కండ్లకు తగులుకొని గాయాల పాలై ప్రమాదాలుసంబంధించిన సంఘటనలు కూడా కలవు ,ముళ్ళ చెట్ల దాపున మలుపులు కనపడక రోడ్డు గుంతల్లో ద్విచక్రవాహదారులు కింద పడిన సంఘటన కూడా కలవు, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయకపోయినాపరవాలేదు కానీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలను తొలగించి రోడ్డు మరమ్మత్తులుచేపట్టాలని ప్రజలు కోరుతున్నారు



## క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**– కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** రానున్న క్రిస్మస్ మరియు నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పిలుపునిచ్చారు. వేడుకల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు మరియు నిబంధనలపై ఆయన పోలీసు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డిసెంబర్ 31 వేడుకల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:

– డ్రంక్ అండ్ డ్రైవ్: మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని, ప్రధాన కూడళ్లలో ఆకస్మిక తనిఖీలు మరియు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

–ర్యాష్ డ్రైవింగ్: రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా సైలెన్సర్లు తొలగించి శబ్ద కాలుష్యం చేసే ద్విచక్ర వాహనదారులపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

– తల్లిదండ్రుల బాధ్యత: మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, యువత హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.

– ప్రజా శాంతి: వేడుకల



పేరుతో ఆకతాయిలు రోడ్లపై హంగామా చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

**యాజమాన్యాలకు సూచనలు:**

పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

శుభాకాంక్షలు:

జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి ఎస్పీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లలోనే సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## మండల మైనార్టీ అధ్యక్షుడు మోయిన్ కు ఘన సన్మానం



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 24 :** హొళగుంద మండల టిడిపి మైనార్టీ అధ్యక్షుడు మోయిన్ ను టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం స్థానిక రైస్ మిల్లు నందు ఘనంగా సన్మానించారు.టీడీపీ మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య,మండల ప్రధాన కార్యదర్శి గోవింద్ గౌడ్,కో కన్వీనర్ జాకీర్, జనసేన కన్వీనర్ అశోక్,బుడగ జంగాల రామాంజిని, చిన్నహ్యాట సర్పంచ్ హేసన్ తదితరులు మోయిన్ ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా టిడిపి కన్వీనర్ తిప్పయ్య మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, తెలుగుదేశం పార్టీ అధిష్టానం చెప్పిన బాధ్యత లను తూచా తప్పకుండా పాటిస్తూ,పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మోయిన్ కు మండల స్థాయిలో పదవి దక్కడం పట్ల హర్షం



వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్రస్థాయి లో ఎదగాలని ఆకాంక్షించారు. నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం నిష్కల్మషంగా నిస్వార్థంగా పనిచేసే ఒక యువ నాయకుడికి పదవి ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకులను గుర్తించి వారికి తగిన హోదాలలో పదవులు ఇస్తూ, రాజకీయంగా యువకులను ప్రోత్సహిస్తున్న ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ మండల అధ్యక్షుడు ముల్లా మోయిన్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి మండల మైనార్టీ అధ్యక్షునిగా ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, తనపై ఇంత ఆధార అభిమానాలను చూపుతూ రాజకీయంగా నన్ను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్క టిడిపి నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని తెలియ జేశారు. అదేవిధంగా మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బి.అబ్దుల్ రెహ్మాన్ ను మండల టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దిడ్డి నాగప్ప,హుస్సేన్ పీరా,సూరన్న, పీరన్న, ముల్లా వలి,బూత్ కన్వీనర్లు తాహెర్, వలి బాషా, అల్తాఫ్,ఇబాదుల్ల,లతీఫ్, టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ మండల స్థాయి సమన్వయ సమావేశం..






**గడివేముల పల్లె వెలుగు దినపత్రిక** నంద్యాల డివిజన్‌లోని గడివేముల మండల సమైక్య కార్యాలయం లో వ్యవసాయ శాఖ, సెర్ప్ పశు వైద్య శాఖ, ఉద్యాన శాఖ మరియు అనుబంధ శాఖల అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏ డి పి యం,) ఆధ్వర్యంలో మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో సింగిల్ విండో అధ్యక్షులు గౌరవనీయులు దేశం సత్యనారాయణ రెడ్డి పాల్గొని ప్రతి గ్రామంలో రైతులతోని ప్రకృతి వ్యవసాయం చేయించాలని సంబంధిత శాఖలకు సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గడం, నేల సారవంతత పెరగడం, పంట దిగుబడులు మెరుగుపడడం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.పశు వైద్యాధికారి హరిణి మాట్లాడుతూ,మహిళలంద రూ ఇంటి వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలను కుటుంబ అవసరాలకు వినియోగించడంతో పాటు గ్రామంలోని ఇతర కుటుంబాలకు అందించాలన్నారు. దీని ద్వారా కుటుంబాల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా గ్రామస్థాయిలో సమగ్ర ఆరోగ్యాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగి, రైతులు అధిక ఆదాయం పొందగలరని తెలిపారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ, సంఘాల లోని ప్రతి మహిళా సభ్యురాలు ఇంటి వద్ద పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలని, పొలం ఉన్న మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి మెరుగైన ఆదాయం సాధించే దిశగా ముందుకు రావాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన అదనపు జిల్లా అధికారి అబ్దుల్ సలాం ప్రకృతి వ్యవసాయం అమలు విధానాలు, నేషనల్ మిషన్ ఫర్ నేచరల్ ఫామింగ్ లక్ష్యాలు మరియు కార్యక్రమాల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం అమల వుతున్న గ్రామాలలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ రూపొందించడమే ఈ సమన్వయ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామస్థాయిలో మూడు రోజుల పాటు క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతు రహీం భాషా మంచాలకట్ట గ్రామం వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమ ంలో రైతులు పాల్గొనడం జరిగింది.

## హిందూ సమ్మేళన కార్యక్రమానికి అధికారులకు ఆహ్వానం





**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 24 :** ఈ నెల 27వ తేదీన హొళగుంద లోని శ్రీ సిద్దేశ్వర దేవాలయ ప్రాంగణంలో జరుగునున్న హిందూ సమ్మేళనానికి మండల తాసిల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీవో విజయ లలిత, గ్రామ సర్పంచ్ తనయుడు చలవాది పంప ను హిందూ సమ్మేళన నిర్వాహక సమితి సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు శ్రీ జగద్గురు శ్రీమరి కొట్టూరు దేశకరు స్వామి, శ్రీ ఎం. బాల చంద్ర, మహిళ అతిథి శ్రీ హారిక మంజునాథ్ ధార్మిక ఉపన్యాసం, శ్రీ సురేంద్ర విభాగ ప్రచారక్ హాజరుకానున్నట్లు హిందూ సమ్మేళన నిర్వాహణ సమితి సభ్యులు తెలిపారు.

## వరిలో తెగులు పట్ల అప్రమత్తంగా ఉండాలి





**మహానంది, పల్లె వెలుగు :** వరి పంటలో ఉల్లి కోడు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలంలోని బొల్లవరం, తమ్మడపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ..ఉల్లికోడు నారుమడి దశ నుండి పిలక దశ వరకు నష్టపరుస్తుందని, దీనివలన అంకురము ఉల్లికాడ వలె పొడుగాటి గొట్టముగా మారి బయటికి వస్తుందని, తద్వారా కంకి వేయదని చివరకు పురుగు ఆశించిన పిలకలు ఎండిపోవడం జరుగుతుందన్నారు.ఈ తెగులు గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు సోకుతుందని తెలిపారు. నివారణకు ఒక సెంటు నారుమడిలో 160 గ్రాముల కార్బో ఫ్యూరాన్ 3జి గుళికలు విత్తనం మొలకెత్తిన 10 నుంచి 15 రోజుల లోపల ,అదేవిధంగా నాటిన 10 నుంచి 15 రోజులకు అనగా పిలక దశలో ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేక ఫిప్రోనిల్ గుళికలు 10 కిలోలు వేయాలని సూచించారు. ఫిప్రోనిల్ అనే మందును ఒక లీటర్ నీటికి 2 మిల్లీలీటర్లు కలుపుకొని పిచికారి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు చాంద్ భాషా, అక్బర్, నరసింహ, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, మంజుల, రైతులు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. :** కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ తరపున మార్కెఫెడ్ ఆధ్వర్యంలో 8,000/ మద్దతుధరతో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడమైనది అని జాయింట్ కలెక్టర్ కే.కార్తీక్ తెలిపారు.నంద్యాల జిల్లాలో కంది పంట1,17,000 ఎకరాలలో దాదాపు 70,562 టన్నుల దిగుబడి రావడం జరుగుతుంది అని, డీసీఎంస్ మరియు ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగినది అని తెలిపారు.జిల్లా కు 25,200 టన్నులు కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు అందినట్లు మార్కొఫెడ్ జిల్లా అధికారి తెలిపారు. దీనికి అవసరమైన గోడౌన్లు మరియు రవాణా గురించి జాయింట్ కలెక్టర్ జిల్లా కొనుగోలు కమిటీ ఏర్పాటు చేసి రేపటి నుండి మీ యొక్క రైతుసేవాకేంద్రాలల్లో కందులు అమ్ముకోదలచినవారు రిజిస్ట్రేషన్ చేసుకోవలసిందిగా , రైతులు ఎవరు తక్కువ ధరకు అమ్మకుండా సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరడం జరిగినది.

# అటవీ భూముల్లో అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 24:**

అటవీభముల్లో గత రెండు రోజులుగా అర్ధరాత్రి నుండి అక్రమార్కులు కొందరు మట్టిని యదేచ్ఛగా తరలిస్తున్నారు. మండల పరిధిలో ఉన్న ఈర్నెపాడు గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతం పరిధిలో మట్టి తవ్వకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈర్నపాడు గ్రామం అటవీ పరిసరాలలో ఉన్న భూమిని అక్రమార్కులు కొందరు టిప్పర్లను ఏర్పాటు చేసుకొని మహానంది మండలానికి యదేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తెలుగు గంగ ప్రధాన కాలువకు సమీపంలో 10 మీటర్ల దూరం నుండి మట్టి అక్రమంగా తరలిపోతోంది. దీనివల్ల ప్రధాన కాలువ బలహీనపడి భవిష్యత్తులో ప్రజలు ఇబ్బందులు పడతారు అన్న విషయాన్ని కూడా పక్కనపెట్టి మట్టి మాఫియా మట్టిని తరలించుకొని పోతూ ఉన్నారు. 1980 ఫారెస్ట్ చట్టం ప్రకారం అటవీ భూములను అటవీ ఇతర ప్రయోజనాలకు వినియోగించుకుంటే చట్టరీత్యా నేరమని తెలిసినా మట్టి మాఫియా అక్రమంగా మట్టిని తరలించుకొని పోతున్నారంటే ఈ విషయంలో మాఫియాకు అధికారులు కొందరు సహకారం అందిస్తున్న కారణంగానే మట్టి మాఫియా తమ ప్రయత్నాలను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారని తెలుస్తోంది. ఈ విషయం అటవీ అధికారుల దృష్టికి రావడంతో మంగళవారం మట్టి తవ్వుతున్న జెసిబి ప్రోక్ లైనరను అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకొని ఓంకారం బేస్ క్యాంపు తరలించడం జరిగింది. తెలుగు గంగ కాలువ సమీపంలోని మట్టి మాఫియా మట్టిని తరలిస్తున్నారని తెలుసుకొని తెలుగు గంగ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ అక్కడి చేరుకున్నారు. మట్టిని తరలిస్తున్న వ్యక్తుల పట్ల ఏమి చేయలేని పరిస్థితులలో ఉండిపోయారని తెలుస్తోంది. కాలువ ఆనుకొని మట్టిని తరలించకపోతున్న అక్రమార్కుల పట్ల ఏమి చేయలేకపోయారా? ఈ విషయాన్ని తెలుగంగ ఉన్నతాధికారులకు సమాచారం అందించారా లేదా అన్న అనుమానాలు తలుచుతూ ఉన్నాయి. మట్టిని తరలిస్తున్న జెసిబి ప్రోక్ లైనర్ను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు ఎందుకు కేసు నమోదు చేయలేదు అన్న ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఈ ప్రాంతంలో మట్టిని తరలిస్తుంటే సంబంధిత రెవెన్యూ కార్యదర్శి ఉన్నతాధికారులకు ఎందుకు సమాచారం అందియ్యలేదు? లేకపోతే మట్టి మాఫియా తో రెవెన్యూ కార్యదర్శి కుమ్మక్కయ్యారా అన్న అనుమానాలు కూడా తలెత్తుతూ ఉన్నాయి. ఈ విషయంలో కొందరు మండల స్థాయి అధికారులు మట్టి మాఫియా కు సహకరించి సంభావనలు బాగానే పుచ్చుకున్నారనే ఆరోపణలు వెలుగుతున్నాయి. జెసిబిని స్వాధీనం చేసుకున్న శాఖ అధికారులు ఎందుకు కేసు నమోదు చేయలేదు అన్న విషయాలు కూడా ప్రస్తుతం చర్చకు దారితీస్తున్నాయి. మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తికి మద్దతుగా కొందరు దళారులు అటవీశాఖ అధికారులతో చర్చించే విషయంలో తలమునకలు కావడం కూడా చర్చకు దారితీస్తూ ఉంది. బుధవారం రాత్రి నాటి కూడా అటవీశాఖ అధికారులు ఈ విషయంపై కేసు నమోదు చేయలేదు. గురువారం ఈ విషయంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.





# ఎంపీ డా.మల్లు రవి, డా. వంశీ చంద్ రెడ్డిలను కలిసిన నూతన సర్పంచ్ లు .





**వెల్దండ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:**

వెల్దండ మండలంలో ఇవాళ జరిగిన స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ సర్పంచ్ లు , మరియు ఉప సర్పంచ్ లు నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి మరియు ఏఐసీసీ కార్యదర్శి, సిడబ్ల్యుసి శాశ్వత ఆహ్వానితులు డాక్టర్ చల్లా వంశీ చంద్ రెడ్డి లను బుధవారం హైదరాబాద్ లోని వారి నివాసాలలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య, గుండాల సర్పంచ్ శిరీష వెంకటయ్య యాదవ్, నారాయణపూర్ సర్పంచ్ తారా సింగ్, జేపల్లి సర్పంచ్ అమీనా, లింగారెడ్డిపల్లి సర్పంచ్ అన్వర్ పాషా , కంటోన్ పల్లి సర్పంచ్ మమత లక్ష్మణ స్వామి మరియు వెల్దండ ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్ ముదిరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీ, ఏఐసీసీ కార్యదర్శులను ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం వారు నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ రమేష్, గుత్తి చంద్రశేఖర్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కర్నూలు జిల్లా జట్టు

## క్రీడా దుస్తులు పంపిణీ చేసిన తెదేపా యువ నాయకుడు గౌతంరెడ్డి

**పల్లె వెలుగు కర్నూల్ రిపోర్టర్ :**

నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో డి.బి.ఎస్. కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 25 తేదీ నుంచి 26 తేదీ వరకు జరగబోయే 8వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల మరియు మహిళలు షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే కర్నూలు జిల్లా జట్టుకు పట్టణానికి చెందిన తేదేపా యువ నాయకుడు గౌతంరెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీల్లో పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతంగా రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలియజేస్తూ , ప్రోత్సహించడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయమా ఉపాధ్యాయులు మధుసూదన్ నాగేశ్వరి సుహాసిని స్వాతి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరుణ, ప్రేమల కలయికే క్రిస్మస్ పండుగ



జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:**

క్రిస్మస్‌ను భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలి %-% కలెక్టర్ ఆకాంక్ష
లోక రక్షకుడు యేసుక్రీస్తు జన్మదినోత్సవం క్రిస్మస్ %-% కలెక్టర్ వ్యాఖ్య
జిల్లా ప్రజలందరూ క్రిస్మస్‌ను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి
క్రైస్తవ సోదర సోదరీమణులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శుభాకాంక్షలు
యేసు ప్రభువు బోధించిన ప్రేమ, కరుణ, శాంతి మార్గంలో నడవాలి %-% కలెక్టర్ క్రిస్మస్ ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలి %-% కలెక్టర్ ఆశయం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలి. జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్...

# గంజాయి బారిన పడ్డ ఐదుగురు యువకులకు కౌన్సిలింగ్





## ఎస్పీ ఆదేశాలతో డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ముమ్మరంగా అవగాహన సదస్సులు

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

కర్నూలు పట్టణంలో గంజాయి సేవనకు అలవాటుపడి పట్టుబడ్డ ఐదుగురు యువకులకు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. బుధవారం ఈగల్ టీం మరియు స్థానిక పోలీసులు కలిసి వీరిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి, అవసరమైన చికిత్స మరియు కౌన్సిలింగ్ ఇప్పించారు. యువకులు మత్తును వీడి సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసులు ఈ సందర్భంగా హితవు పలికారు.తమ పిల్లలు గంజాయి సేవిస్తున్నట్లు గమనించిన తల్లిదండ్రులు 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించడంతో పోలీసులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు. ఎవరైనా డ్రగ్స్ లేదా గంజాయి సేవించినా, విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

**అవగాహన కార్యక్రమాలు:**

జిల్లా వ్యాప్తంగా గంజాయి రహిత సమాజం కోసం పోలీసులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో:

దాదాపు 200 హాట్ స్పాట్స్‌ను గుర్తించి మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.

500 మంది విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ సైకిల్ ర్యాలీ చేపట్టారు.

మాదక ద్రవ్యాల వల్ల కలిగే ఆరోగ్య నష్టాలను, అంధకారమయ్యే భవిష్యత్తు గురించి యువతకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాల సమాచారాన్ని 1972 నెంబర్‌కు తెలియజేయాలని కోరారు.

# కర్నూలు జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి. అబ్దుల్ సుబాన్

**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 24**



కర్నూలు జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా హొళగుంద మండల సీనియర్ నాయకులు బి అబ్దుల్ సుబాన్ నియమితులయ్యారు. టిడిపి సీనియర్ నాయకులు బి అబ్దుల్ సుభాన్ ఎన్నో ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కోసం పని చేస్తూ, రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ, మచ్చలేని నాయకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు.అపార సేవా భావం కలిగిన టిడిపి సీనియర్ నాయకులు బి అబ్దుల్ సుబాన్ ఎంతోమందికి సాయం చేస్తూ, ఎన్నో సేవలు చేస్తూ, తను చేసిన సాయం పబ్లిసిటీకి కాకుండా పబ్లిక్ కు ఉపయోగపడే విధంగా తనదైన శైలిలో వ్యవహరిస్తూ,మంచి వ్యక్తిత్వం గలవారీగా కులమతాలతీతంగా మండల ప్రజలందరూ అభిమానించే నాయకుడిగా పేరు సంపాదించుకున్నారు.పదవులు ఆశించకుండా తన అనుచరగణంతో పాటు మండలంలోని టిడిపి కోసం పనిచేసే ప్రతి యువకునికి ప్రాధాన్యత ఇస్తూ టిడిపి పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బి అబ్దుల్ సుబాన్ కు నేడు కర్నూలు జిల్లా పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులతోపాటు ప్రజలు బి అబ్దుల్ సుబాన్ కు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నేడు ఆయన సేవలను గుర్తించి కర్నూలు జిల్లా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించిన ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకుంఠం శివప్రసాద్, సహకరించిన మండల నాయకులకు కార్యకర్తలకు బి.అబ్దుల్ సుభాన్ ధన్యవాదాలు తెలిపారు.

# గొర్రెలకు ,మేకలకు నట్టల నివారణ మందులు .



**వెల్దండ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:**

వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, లింగారెడ్డిపల్లి, లాలు తండా, కుందారం తండా మరియు సీలోని భావి తండా గ్రామాలలో గొర్రెలకు మరియు మేకలకు పశువైద్యాధికారులు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్యాంసుందర్, సర్పంచ్ లు కేస మల్ల అనూష కృష్ణ, రత్లావత్ గన్యా నాయక్, రాత్లావత్ లక్ష్మీపతి మరియు ఉప సర్పంచ్ లు చెన్నూర్ ప్రసాద్ చారి, రాత్లావత్ అనిత, రాములమ్మ, మరియు ఆయా గ్రామాల వార్డు మెంబర్లు, పశు వైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, ఫణిందర్ రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు మొగులయ్య, సాయిబాబా, విజేందర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# మహానందిలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి వేడుకలు.

**మహానంది, పల్లె వెలుగు**

మహానంది పుణ్యక్షేత్రంలో ఈ నెల 30వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని క్షేత్రంలో వెలిసిన శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత కోదండరామ స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారిని ఉత్తరద్వారం వద్ద కొలువుతీర్చి భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పూజలకు నంద్యాల మాజీ ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి సంపూర్ణ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.ఇదే క్రమంలో నంద్యాలలో మాజీ ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి,ఆలయ అభివృద్ధిలో భాగంగా వసతి గృహాల ఏర్పాటుకు సహకరించాల్సిందిగా కోరినట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ ని వేద పండితులు రవిశంకర అవధాని వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు పాల్గొన్నారు.



# నంద్యాల జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన గౌరు చరిత రెడ్డి కి అభినందనలు తెలిపిన వడ్డు లక్ష్మీదేవి...

**పల్లె వెలుగు దినపత్రిక గడివేముల**

నంద్యాల జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరితరెడ్డి గారికి గౌరు వెంకటరెడ్డి గారికి శుభాకాంక్షలు తెలియజేసిన స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్ ఒడ్డు లక్ష్మీదేవి అభినందనలు తెలియజేశారు, మన ప్రియతమ నాయకురాలు గౌరు చరితరెడ్డి ఇంక ఎన్నో ఉన్నతమైన పదవులు పొంది పాణ్యం నియోజకవర్గానికి మరియు నంద్యాల జిల్లా అధ్యక్షురాలుగా ఎన్నికైన సందర్భంగా ఆమె మన జిల్లాను, నియోజకవర్గంను అభివృద్ధి బాటలో తీసుకెళ్లాలని ఇంకా ఉన్నతమైన పదవులు పొందాలని ఆ దేవుని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను తెలిపారు,

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**మహానంది, పల్లె వెలుగు**



పది ఫలితాల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం గోపవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి కాకుండా చదువుపై ఇష్టపడి చదివితే కచ్చితంగా ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు,ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

# పంచాయతీ భవనంకు స్థలం కేటాయించాలని.. ఎమ్మార్వోకు వినతి.



**వెల్దండ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:** వెల్దండ మండల పరిధిలోని అల్లం తోట బావి తండా పంచాయతీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ.. సర్పంచ్ రోజా అరుణ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బుధవారం వెల్దండ ఎమ్మార్వో కార్తీక్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి 2022 లో ఎస్.ఎస్.ఎఫ్ లో రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయని, అయితే స్థలం లేక నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. దీంతో స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, పంచాయతీ సెక్రెటరీ నందకిషోర్, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, మరియు మాజీ సర్పంచ్ కుమార్, మాజీ ఎంపిటిసి కాడు రామ్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, హనుమంతు, శంకర్, రాజు ,సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ జయంతి వారోత్సవాలను జయప్రదం చేయండి

## ఓర్వకల్లులో కరపత్రాల విడుదల రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (RSF) పిలుపు



**పల్లె వెలుగు కర్నూల్ రిపోర్టర్ :** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయులు, చదువుల తల్లులు సావిత్రిబాయి పూలే మరియు ఫాతిమా షేక్ ల జయంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ (%=వాఖీ%) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం ఓర్వకల్లు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం, విద్యార్థులతో కలిసి వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు.

ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. స్త్రీ విముక్తి కేవలం విద్యతోనే సాధ్యమని నమ్మిన సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ లు బాలికల విద్య కోసం తమ జీవితకాలం శ్రమించారని కొనియాడారు. వారి ఆశయాలను స్మరిస్తూ రాయలసీమ జిల్లాల వ్యాప్తంగా జనవరి 3 నుండి జనవరి 9 వరకు జయంతి వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

నేటి తరానికి వారి త్యాగాలను వివరించడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ నాయక్, రాజశేఖర్ మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# రోడ్డు విస్తరణ పనులకు సర్పంచ్ భూమి పూజ.

**వెల్దండ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:** వెల్దండ మండల కేంద్రం నుంచి చారకొండ మండలం సిరిసనగండ్ల వరకు చేపట్టే తారు రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి ల ఆధ్వర్యంలో వార్డు సభ్యులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బుధవారం మండల కేంద్రంలోని బుధవార్ పేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రహదారి నిర్మాణానికి రూ. 42 కోట్లతో 22 కిలోమీటర్ల వరకు చేపట్టే రెండు వరుసల నిర్మాణ రహదారి పనులు ప్రారంభించారు. అనంతరం.. సెంటర్ లైటింగ్ లను ఏర్పాటు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, కృష్ణారెడ్డి, కృష్ణ ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్దండ మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు.



## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన రామాంజనేయులు.

**డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:** వెల్దండ మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన రామాంజనేయులు. విశ్వ మానవాళికి తన ప్రేమ తత్వం తో వెలుగులు పంచిన కరుణా మయుడు , ప్రేమమూర్తి ఏసుక్రీస్తు పుట్టినరోజు సందర్భంగా బొల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పకాడి. రామాంజనేయులు మండలంలోని క్రైస్తవులందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సేవా, త్యాగం ,క్షేమ, కరుణ, వంటి అత్యుత్తమ జీవన మార్గాలను మానవ జాతికి అందించి, ఇతరుల కోసం జీవించడం అనే గొప్ప నేర్పిన క్రీస్తు జన్మదినం డిసెంబర్ 25 ఎంతో పవిత్రమైన రోజు అని అన్నారు. మానవత్వాన్ని చాటే ఏసుక్రీస్తు బో ధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని, అవి అందరికీ ఆచరణీయమని ఆయన పేర్కొన్నారు.

# వెల్దండ సర్పంచ్ ను సన్మానించిన 2001-02 పదవ తరగతి బ్యాచ్.



**వెల్దండ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:**

వెల్దండ గ్రామంలో స్థానిక ఎన్నికల్లో భాగంగా నూతనంగా విజయం సాధించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ను పదవ తరగతి 2001- 02 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం.. వార్డు సభ్యులు జంగిలి ఆనంద్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి శ్రీను, ఎనుముల తానేష్ యాదవ్, హరికిషన్ నాయక్, వెంకటేష్, ఆనంద్, సింగరాజు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహణ



**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 24**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎమ్మిగనూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సేమి-క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఏసుక్రీస్తు ప్రభువు వారి ఆశీర్వాదం అందరి మీద ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రభువును ప్రార్థిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించి, శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొంటూ, సమాజంలో ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ తెలుగుదేశం పార్టీ కమిటీ అధ్యక్షులు ఎంబి మహేష్, ప్రధాన కార్యదర్శి దామా నరసింహులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, కౌన్సిలర్ రామదాసు గౌడ్, 7వ వార్డు ఇన్చార్జ్ అంబేద్కర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కదిరికోట షాలేం, 8వ వార్డు అధ్యక్షులు సుందర్రాజు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య, నందవరం వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు ధర్మపురం గోపాల్, నందవరం టిడిపి కన్వీనర్ ఖాసీం వలి, ఎరుకల సూరి, రాజేంద్ర, వెంకటేశ్వర రెడ్డి, దాదాసాహెబ్, జయన్న, మహేంద్ర బాబు, డీలర్ రామకృష్ణ, అబ్దుల్లా, రాము, శేఖర్, వడ్డే కృష్ణ, విజయలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పి.డి.ఎస్.యూ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ.

**వెల్దండ డిసెంబర్ 24 పల్లె వెలుగు దినపత్రిక:**

పిడిఎస్యు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ బుధవారం వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. జనవరి 5,6,7 తేదీలలో వరంగల్ నందు జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సంఘం సైంటిఫిక్ ఎడ్యుకేషన్ కోసం, సమాజ నిర్మాణం కోసం స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ కోసం , సంక్షేమ హాస్టల్ సమస్యల పైన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు వెల్దండ అధ్యక్షుడు ఆంజనేయులు, విద్యార్థి నాయకులు వంశీ, విశాంత్, కళాశాల విద్యార్థులు పల్లవి, భార్గవి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# పీపీపీ విధానంపై వెనక్కి తగ్గేదేలేదు

- పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో రాజీ లేదన్న సీఎం
- పీపీపీ విధానంలోనే మెడికల్ కాలేజీల నిర్మాణమంటూ స్పష్టీకరణ
- వీజీఎఫ్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 30 శాతం ఆర్థిక సాయం
- ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందానికి ఆదేశం
- చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు విస్తరించాలని సూచన



పేదలకు నాణ్యమైన వైద్య విద్య, వైద్య సేవలు అందించే విషయంలో ఎక్కడా రాజీపడేది లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే వైద్య కళాశాలల నిర్మాణం చేపడతామని, దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

### పీపీపీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్

పీపీపీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు. ఈ పథకం కింద వైద్య రంగంలోని ప్రాజెక్టులకు అయ్యే వ్యయంలో 60 శాతం వరకు ఆర్థిక మద్దతు లభిస్తుందని, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 30 శాతం వాటాను భరిస్తాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్, ఝార?ండ్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ వీజీఎఫ్ అమలు చేయాలని సీఎం సూచించారు.

### ఆదోని మెడికల్ కాలేజీకి సంస్థ ఖరారు

రాష్ట్రంలో తొలి విడతగా ఆదోని, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీల నిర్మాణానికి టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి ఒక సంస్థ ముందుకు రాగా, ఆ సంస్థతో వెంటనే ఒప్పందం చేసుకొని పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. మిగిలిన కళాశాలల టెండర్ల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు.

### సంజీవని ప్రాజెక్టుపై సమీక్ష

ఈ సమావేశంలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన “సంజీవని”పైనా సీఎం సమీక్షించారు. కుప్పంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ, త్వరలోనే ఈ ప్రాజెక్టును చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# టీటీడీలో అక్రమాలను వెలికితీస్తున్నాం

- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- జగన్ పాలనలో తిరుమలలో ఘోరాలు జరిగాయన్న మంత్రి జనార్ధన్ రెడ్డి
- లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటంపై తీవ్ర విమర్శలు
- టీటీడీలో గత ప్రభుత్వ అక్రమాలను ప్రక్షాళన చేస్తున్నామన్న మంత్రి
- కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల నుంచి అపూర్వ స్పందన
- పెట్టుబడిదారులను భయపెట్టేలా ప్రతిపక్షం తీరు ఉందని ఆరోపణ
- సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యం



గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పవిత్ర తిరుమల క్షేత్రంలో అనేక అక్రమాలు, మహాపాపాలు జరిగాయని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.గత ప్రభుత్వ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారి సౌకర్యాల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా నిర్లక్ష్యం వహించిందని జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పాత్రపై కూడా ఇప్పుడు ప్రజలకు స్పష్టత వస్తోందని, అయితే ఆ వ్యవహారాలు న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున ఎక్కువగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టామని, ప్రసాదాలకు వాడే నెయ్యితో సహా అన్ని పదార్థాలను కఠినంగా పరీక్షించాకే వినియోగిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఏకాదశి రోజున ‘వైకుంఠం దర్శనం’ ద్వారా 90 శాతానికి పైగా సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. అసలు దేవుడిపై నమ్మకం లేని వ్యక్తికి టీటీడీ లాంటి పవిత్ర సంస్థ బాధ్యతలు అప్పగించడమే గత ప్రభుత్వపు పెద్ద తప్పిదమని ప్రజలు భావిస్తున్నారన్నారు.

### కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు

గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని జనార్ధన్ రెడ్డి చెప్పారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు చేపట్టామని, సీఐఐ సదస్సుల ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు విశ్వసనీయ గమ్యస్థానంగా మారిందన్నారు. కొత్త పోర్టులు, ఐదు విమానాశ్రయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

### ప్రతిపక్షం తీరు మారాలి

ప్రతిపక్ష నేతలు పెట్టుబడిదారులను భయపెట్టేలా మాట్లాడటం దురదృష్టకరమని, వారి బెదిరింపులకు ఎవరూ భయపడరని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు వైసీపీని 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకోవడం కాదని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభకు హాజరుకావాలని హితవు పలికారు.గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆర్అండ్‌బీ శాఖను పునరుద్ధరించి, ఏడాదిలోనే రూ. 3000 కోట్ల విలువైన రహదారి పనులకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను నిర్మించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేశామని, జూన్ చివరికల్లా పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



# కేసీఆర్ వ్యాఖ్యలపై ఏపీ మంత్రి పార్థసారథి ఫైర్

ఏపీకి వస్తున్న పెట్టుబడులపై కేసీఆర్ వ్యాఖ్యలను తప్పుబట్టిన పార్థసారథి

ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదని మండిపాటు

రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనేదే చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్య

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ గురించి, ఏపీకి వస్తున్న పెట్టుబడుల గురించి కేసీఆర్ మాట్లాడిన తీరు అభ్యంతరకరమని మండిపడ్డారు. భాష, యాస, ప్రాసలపై పట్టు ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదని అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఏపీకి వస్తున్న పెట్టుబడులపై మీకు ఏవైనా అనుమానాలు ఉంటే... వాటిని పారదర్శకంగా మీకు చూపిస్తామని కేసీఆర్ కు పార్థసారథి సూచించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టిన వారు తెలంగాణలో కూడా పెట్టుబడులు పెట్టారని చెప్పారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనేదే తమ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని... ఈ విషయాన్ని ఆయన ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంసం నుంచి అమరావతిని అభివృద్ధి చేస్తుంటే... మీరు ఇలా మాట్లాడటం తగదని అన్నారు.

# చలిలో పొలం పనుల్లో పరిటాల సునీత

వెంకటాపురంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన సునీత

పనుల్లో నిమగ్నమైన కూలీలతో మమేకమైన వైనం

వ్యవసాయంలో ఉండే తృప్తి మరెక్కడా ఉండదన్న సునీత



నిరంతరం ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ కార్యలాపాలతో బిజీగా ఉండే టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత తమ పొలంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తమ స్వగ్రామం వెంకటాపురంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె సందర్శించారు. ఉదయం చలిలో పొలంలోకి వెళ్లిన ఆమె... అప్పటికే అక్కడ పనుల్లో నిమగ్నమైన కూలీలతో మమేకమయ్యారు. అక్కడ సాగు చేస్తున్న వివిధ పంటలను పరిశీలించారు. పొలంలో ఉన్న మిరపకాయలను కోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వ్యవసాయంలో ఉండే సంతృప్తి మరెక్కడా ఉండదని చెప్పారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మరోవైపు, పరిటాల సునీత వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# సెంచరీలతో దుమ్ముదులిపిన కోహ్లీ, రోహిత్ శర్మ

## ప్రారంభమైన విజయ్ హజారే ట్రోఫీ పరుగుల వరద పారించిన దిగ్గజాలు

భారత దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజే టీమ్ ఇండియా దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ బ్యాట్‌లతో మైదానంలో పరుగుల వరద పారించారు. ఒకవైపు విరాట్ కోహ్లీ అంతర్జాతీయ స్థాయి మైలురాయిని అధిగమించగా, మరోవైపు రోహిత్ శర్మ తన ట్రేడ్ మార్క్ ఇన్నింగ్స్‌తో అభిమానులను ఉర్రూతలూగించారు.ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేశారు. ఈ మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగు తీయడం ద్వారా విరాట్ లిస్ట్-ఎ క్రికెట్‌లో 16,000 పరుగుల చారిత్రక రికార్డు మైలురాయిని చేరుకున్నారు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ బ్యాట్స్‌మన్‌గా విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ



మైలురాయిని అందుకున్న 9వ ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. 299 పరుగుల లక్ష్యఛేదనలో కోహ్లీ కేవలం 83 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశారు. 110 బంతుల్లో 131 పరుగులు చేసి వెనుదిరిగాడు కోహ్లీ. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టీమ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు. కేవలం 61 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్న రోహిత్, మొత్తంగా 94 బంతుల్లో 155 పరుగులు (18 ఫోర్లు, 9 సిక్సర్లు) సాధించి ఔట్ అయ్యారు. 237 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని రోహిత్ తన ఒంటిచేత్తో ఛేదించి ముంబైకి ఘనవిజయాన్ని అందించారు. జైపూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రోహిత్‌ను చూడటానికి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఈ మైలురాయిని అందుకున్న 9వ ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. 299 పరుగుల లక్ష్యఛేదనలో కోహ్లీ కేవలం 83 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశారు. 110 బంతుల్లో 131 పరుగులు చేసి వెనుదిరిగాడు కోహ్లీ. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ టీమ్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది.మరోవైపు విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ముంబై జట్టు తరఫున ఆడుతున్న రోహిత్ శర్మ, సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడారు. కేవలం 61 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్న రోహిత్, మొత్తంగా 94 బంతుల్లో 155 పరుగులు (18 ఫోర్లు, 9 సిక్సర్లు) సాధించి ఔట్ అయ్యారు. 237 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని రోహిత్ తన ఒంటిచేత్తో ఛేదించి ముంబైకి ఘనవిజయాన్ని అందించారు. జైపూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రోహిత్‌ను చూడటానికి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. దేశీయ 50 ఓవర్ల టోర్నమెంట్లు (విజయ్ హజారే వంటివి), అంతర్జాతీయ వన్డేలు రెండింటినీ కలిపి 'లిస్ట్-ఎ' క్రికెట్‌గా పరిగణిస్తారు. ఇందులో అత్యధిక పరుగుల రికార్డు ఇంగ్లాండ్ దిగ్గజం గ్రాహం గూచ్ (22,000 పైచిలుకు) పేరిట ఉంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరు కలిసి తమ జట్ల కోసం ఇరువురు సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఈ ఇద్దరు దిగ్గజాలు ఫామ్‌లోకి రావడం భారత క్రికెట్ అభిమానులకు పెద్ద పండగ లాంటి వార్త.



# కోహ్లీ 16 వేల పరుగుల మైలురాయి



భారతదేశ దేశీయ వన్డే టోర్నమెంట్ అయిన విజయ్ హజారే ట్రోఫీలో ఈసారి చాలా మంది సూపర్ స్టార్ ఆటగాళ్లు ఆడుతున్నారు. బుధవారం నుంచే ఈ దేశీయ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో దిగ్గజ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ ఢిల్లీ జట్టులో సభ్యుడు. ఇక హిట్ మ్యాన్‌గా పేరుగాంచిన రోహిత్ శర్మ ముంబై తరఫున ఆడుతున్నాడు. విరాట్ కోహ్లీ ఢిల్లీ తరఫున ఆడుతూ 83 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఛేజ్ మాస్టర్ ఆంధ్రతో జరిగిన మ్యాచ్ లో 299 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ 9 ఫోర్లు, 3 సిక్సర్ల సహాయంతో సెంచరీ పూర్తి చేశాడు. ఇక ముంబై తరఫున సిక్కింతో జరిగిన మ్యాచ్ లో 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ రోహిత్ శర్మ 71 బంతుల్లో సెంచరీ సాధించాడు. రోహిత్ కేవలం 94 బంతుల్లో 155 పరుగుల భారీ ఇన్నింగ్స్ ఆడాడు. హిట్ మ్యాన్ బ్యాట్ నుంచి 18 ఫోర్లు, 9 సిక్సర్లు వచ్చాయి. విరాట్ కోహ్లీ 101 బంతుల్లో 131 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. అతను 14 ఫోర్లు, 3 సిక్సర్లు కొట్టాడు. ఇంకా ఢిల్లీకి గెలవడానికి 25 పరుగులు కావాల్సిన టైంలో విరాట్ అవుట్ అయ్యాడు. అతని వికెట్‌ను సత్యనారాయణరాజు తీశాడు. ఆ జట్టులో ఆడుతున్న నితీష్ రాణా ఫిఫ్టీ కొట్టాడు. ఇక రోహిత్ శర్మ జట్టు మ్యాచ్ గెలిచింది. రోహిత్ 155 పరుగులు చేసి క్యాచ్ అవుట్ అయ్యాడు. రోహిత్ కేవలం 61 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. రోహిత్ శర్మ తన సెంచరీ ఇన్నింగ్స్‌లో 8 సిక్సర్లు, 9 ఫోర్లు కొట్టాడు. జైపూర్‌లో జరుగుతున్న ముంబై వర్సెస్ సిక్కిం మ్యాచ్ ను చూడటానికి రోహిత్ శర్మ కోసం చాలా మంది ప్రేక్షకులు తరలివచ్చారు. ఢిల్లీ తరఫున కేవలం ఒక పరుగు చేయడంతోనే విరాట్ కోహ్లీ లిస్ట్ ఏ క్రికెట్ లో 16 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఈ మ్యాచ్ కు ముందు వరకు విరాట్ ఖాతాలో 342 లిస్ట్ ఏ మ్యాచ్ లలో 15999 పరుగులు ఉన్నాయి. విరాట్ ఇప్పుడు సచిన్ టెండూల్కర్ తర్వాత లిస్ట్ ఏ మ్యాచ్‌లలో 16 వేల పరుగుల మైలురాయిని అందుకున్న రెండో భారతీయుడిగా నిలిచాడు. ఇక ప్రపంచంలో ఈ ఘనత సాధించిన 9వ బ్యాట్స్ మెన్ గా నిలిచాడు. ఇంగ్లాండ్ మాజీ దిగ్గజం గ్రాహం గూచ్ లిస్ట్ ఏ క్రికెట్ లో అత్యధిక పరుగులు చేసిన రికార్డును కలిగి ఉన్నాడు. గూచ్ ఖాతాలో 22 వేలకు పైగా పరుగులు ఉన్నాయి. దేశీయ 50 ఓవర్ల మ్యాచ్ లు, వన్డే ఇంటర్నేషనల్ పరుగులు లిస్ట్ ఏ మ్యాచ్ లలో చేరుస్తారు.

.....

# ఇషాన్ కిషన్ కేవలం 33 బంతుల్లో సెంచరీ

విజయ్ హజారే ట్రోఫీలో బుధవారం 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కేవలం 36 బంతుల్లో సెంచరీ చేసి కొత్త రికార్డు సృష్టించాడు, కానీ కొన్ని గంటల్లోనే జార?ండ్ కెప్టెన్ ఇషాన్ కిషన్ వైభవ్ రికార్డును బద్దలు కొట్టాడు. ఇషాన్ కిషన్ కేవలం 33 బంతుల్లో సెంచరీ చేసి తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించాడు. ఇషాన్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో సెంచరీ సాధించాడు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, విజయ్ హజారేలో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు వీరిద్దరి పేరిట లేదు. బిహార్ కెప్టెన్ సకిబుల్ ఘనీ కేవలం 32 బంతుల్లో సెంచరీ సాధించాడు. విజయ్ హజారే ట్రోఫీలో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు సకిబుల్ ఘనీ పేరిట నమోదైంది. ఇషాన్ కిషన్ విధ్వంసకర ఇన్నింగ్స్ సోషల్ మీడియాలో బాగా చర్చనీయాంశమైంది. 27 ఏళ్ల ఇషాన్ కిషన్ కేవలం 39 బంతుల్లో 125 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సమయంలో అతని బ్యాట్ నుంచి 7 ఫోర్లు, 14 సిక్సులు వచ్చాయి. కర్ణాటకపై ఇషాన్ స్ట్రైక్ రేట్ 300 కంటే ఎక్కువగా ఉంది. దీంతో అభిమానులు ఈ బ్యాట్స్‌మెన్‌ను 2026 టీ20 ప్రపంచ కప్ కోసం టీమ్ ఇండియాలో ఎంపిక చేయాలని సంతోషిస్తున్నారు. బిహార్ తరఫున వైభవ్ సూర్యవంశీ 84 బంతుల్లో 190 పరుగులు చేశాడు. అతని బ్యాట్ నుంచి 16 ఫోర్లు, 15 సిక్సులు వచ్చాయి. బిహార్ కెప్టెన్ సకిబుల్ ఘనీ 40 బంతుల్లో 128 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతను 10 ఫోర్లు, 12 సిక్సులు కొట్టాడు. వీరిద్దరితో పాటు ఆయుష్ లోహరుకా 56 బంతుల్లో 116 పరుగులు చేశాడు. ఈ ముగ్గురి



సెంచరీల సహాయంతో బీహార్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 574 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని గెలిపించిన ఇషాన్ కిషన్ విజయ్ హజారే ట్రోఫీలో మిడిల్ ఆర్డర్‌లో ఆడాడు. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఇషాన్ కేవలం 39 బంతుల్లో 125 పరుగులు చేశాడు. ఇషాన్ అద్భుతమైన ఇన్నింగ్స్ సహాయంతో జార?ండ్ 50 ఓవర్లలో 412 పరుగుల భారీ స్కోరు సాధించింది.

## రిషబ్ పంత్‌కు అమిత్ మిశ్రా స్ట్రాంగ్ వార్నింగ్



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ ఆటతీరుపై మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు చేశారు. పంత్ తన బ్యాటింగ్ శైలిని మార్చుకోకపోతే జట్టులో చోటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 2018లో అరంగేట్రం చేసిన పంత్, టెస్టుల్లో అద్భుతమైన రికార్డులు కలిగి ఉన్నప్పటికీ, నిలకడలేమి అతనికి శాపంగా మారిందని మిశ్రా అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు పంత్ అంటే కుర్రాడు, తప్పులు చేస్తాడులే అని సరిపెట్టుకునే వాళ్లమని, కానీ ఇప్పుడు అతనికి 28 ఏళ్లు వచ్చాయని మిశ్రా గుర్తు చేశారు. “రిషబ్ 2018 నుంచి జట్టులో ఉన్నాడు. ఇప్పుడు అతన్ని యంగ్ ప్లేయర్ అని అనలేము. కెరీర్‌లో ఒక స్థాయికి వచ్చాక పరిస్థితులకు తగ్గట్టుగా ఆటను మార్చుకోవడం చాలా అవసరం. కానీ పంత్ మాత్రం పదే పదే ఒకే రకమైన పొరపాట్లు చేస్తూ వికెట్ పారేసుకుంటున్నాడు” అని ఒక పాడ్‌కాస్ట్‌లో మిశ్రా విమర్శించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రత్యర్థి జట్లు ఆటగాళ్ల బలహీనతలను లోతుగా విశ్లేషిస్తాయని మిశ్రా హెచ్చరించారు. “నువ్వు ఏ బంతిని అటాక్ చేస్తావు, ఏ బంతిని ఆడలేవు అనేది ప్రత్యర్థులు గమనిస్తున్నారు. ప్రతిసారీ నేను ఇలాగే ఆడతాను.. ఇదే నా స్టైల్ అంటే కుదరదు. అలా మొండిగా ఉంటే మరో నాలుగు ఐదు మ్యాచ్‌లు ఆడిస్తారేమో కానీ, ఆ తర్వాత జట్టు నుంచి తప్పిస్తారు. వికెట్, పరిస్థితులకు తగ్గట్టుగా గేర్ మార్చడమే గొప్ప ఆటగాడి లక్షణం” అని పంత్‌కు సూచించారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన హోమ్ టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-2తో వైట్‌వాష్‌కు గురైంది. ఈ సిరీస్‌లో పంత్ బ్యాటర్‌గా కేవలం 49 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. శుభ్‌మన్ గిల్ గాయపడటంతో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటికీ, అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు నాయకత్వంలోనూ పంత్ ఆశించిన మేర రాణించలేదు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. టర్నింగ్ ట్రాక్‌లు లేదా బౌన్స్ ఉండే పిచ్‌లపై ఒకే రకమైన షాట్లు ఆడటం వల్ల ప్రయోజనం ఉండదని మిశ్రా స్పష్టం చేశారు. రిషబ్ పంత్ టెస్టుల్లో 8 సెంచరీలు బాది భారత వికెట్ కీపర్లలో టాప్ రికార్డు సృష్టించాడు. అయితే వైట్ బాల్ క్రికెట్ లో అతని ప్రదర్శన అంతంతమాత్రంగానే ఉంది. ప్రస్తుతం టెస్ట్ జట్టులో వైస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, తన షాట్ సెలక్షన్‌ను మెరుగుపరుచుకోకపోతే త్వరలోనే అతడిపై బోర్డు కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అమిత్ మిశ్రా హెచ్చరించారు.

## సూర్యకుమార్ వల్లే శుభ్‌మన్ గిల్‌పై వేటు

### మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప విమర్శ

టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కారణంగానే శుభ్‌మన్ గిల్‌పై వేటు పడిందని మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప అన్నాడు. ఇద్దరూ ఫామ్‌లో లేని ఆటగాళ్లను కొనసాగించడం జట్టుకు శ్రేయస్కరం కాదనే భారత సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారని అభిప్రాయపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 బరిలోకి దిగే భారత జట్టును ఇటీవల బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే.రెగ్యులర్ టీ20 టీమ్‌లో రెండు మార్పులు చేసిన సెలెక్టర్లు.. మిగతా జట్టును కొనసాగించారు. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను తప్పించి ఇషాన్ కిషన్‌ను బ్యాకప్ వికెట్ కీపర్ కమ్ ఓపెనర్‌గా ఎంపిక చేశారు. జితేశ్ శర్మను తప్పించి రింకూ సింగ్‌ను తీసుకున్నారు. అక్షర్ పటేల్‌కు తిరిగి వైస్ కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఈ టీమ్ గురించి మాట్లాడిన రాబిన్ ఊతప్ప.. సూర్య వల్లే గిల్‌పై పక్కనపెట్టాల్సి వచ్చిందన్నాడు. 'ప్రపంచకప్ నేపథ్యంలో జట్టులో ఫామ్‌లో లేని ఒక్క ఆటగాడిని మాత్రమే కొనసాగించవచ్చు. అంతకంటే ఎక్కువ మందిని తీసుకుంటే జట్టుకు ఇబ్బందులు ఎదురవుతాయి. సూర్యకుమార్ యాదవ్ ఈ మధ్య అంతగా పరుగులు చేయడం లేదు. అందుకే శుభ్‌మన్ గిల్ జట్టులో చోటు దక్కలేదని నా అభిప్రాయం. సూర్య ఫామ్‌లో లేడని నేను చెప్పలేను. కానీ అతను పరుగులు చేయడం లేదు. శుభ్‌మన్ గిల్ మాత్రం ఫామ్‌లో లేడు. అతను పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్నాడు. శుభ్‌మన్ గిల్ కాస్త గందరగోళంగా కనిపిస్తున్నాడు. సౌతాఫ్రికాతో సిరీస్‌లో లుంగి ఎంగిడి అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను శుభ్‌మన్ గిల్‌ను తన బంతులతో ఇబ్బంది పెట్టాడు.టీ20 ప్రపంచకప్ జట్టును చూసి నేను షాకయ్యా. నిద్రలోంచి మేల్కొని నా ఫోన్ చూశాం. నేను చాలా ఆనందపడ్డా. వారు నిజంగా అద్భుతమైన జట్టును ఎంపిక చేశారు. అయితే వారు ముందుగా గిల్‌ను టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా ప్రకటించకుండా ఉండాల్సింది.'అని రాబిన్ ఊతప్ప అభిప్రాయపడ్డాడు.

.......

# 36 బంతుల్లో సెంచరీ.. 54 బంతుల్లో 150..


### విజయ్ హజారే ట్రోఫీలో వైభవ్ సూర్యవంశీ బీభత్సం



బీహార్ సంచలనం 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ దేశవాళీ క్రికెట్‌లో మరోసారి చరిత్ర సృష్టించాడు. విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఈ క్రమంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న వరల్డ్ రికార్డును కేవలం 10 బంతుల తేడాతో బద్దలు కొట్టాడు. రాంచీలోని జేఎస్‌సీఏ ఓవల్ మైదానంలో అరుణాచల్ ప్రదేశ్‌పై వైభవ్ సూర్యవంశీ విధ్వంసం సృష్టించాడు. కేవలం 84 బంతుల్లో 190 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, 15 భారీ సిక్సర్లు ఉన్నాయి. 226 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన వైభవ్, కేవలం 36 బంతుల్లోనే తన సెంచరీ పూర్తి చేశాడు. ఇది విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీగా రికార్డులకు ఎక్కింది. కొద్దిలో డబుల్ సెంచరీ మిస్ అయినప్పటికీ, అతను సృష్టించిన ప్రభంజనం మాత్రం మామూలుగా లేదు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అతివేగంగా 150 పరుగుల మార్కును అందుకున్న ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు చరిత్ర సృష్టించాడు. గతంలో ఈ రికార్డు ఏబీ డివిలియర్స్ పేరిట ఉండేది. డివిలియర్స్ 2015 ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌పై 64 బంతుల్లో 150 పరుగులు పూర్తి చేశాడు. అయితే, వైభవ్ కేవలం 54 బంతుల్లోనే 150 పరుగుల మైలురాయిని చేరుకుని, డివిలియర్స్ కంటే 10 బంతులు తక్కువ ఆడి ఈ వరల్డ్ రికార్డును తన సొంతం చేసుకున్నాడు. కేవలం 14 ఏళ్ల 272 రోజుల వయసులోనే లిస్ట్-ఏ క్రికెట్‌లో సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పటి వరకు ఏ ప్రొఫెషనల్ వన్డే టోర్నీలోనూ ఇంత చిన్న వయసులో ఎవరూ సెంచరీ చేయలేదు. ఇటీవలే ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఇతడిని భారీ ధరకు కొనుగోలు చేయగా, ఈ ఇన్నింగ్స్‌తో తానెందుకు స్పెషలో వైభవ్ మరోసారి నిరూపించుకున్నాడు. అండర్-19 ఆసియా కప్ ఓటమి బాధ నుంచి త్వరగానే కోలుకుని, సీనియర్ స్థాయిలో ఈ అద్భుత ప్రదర్శన చేయడం విశేషం.

# నా ఫేవరేట్ హీరోయిన్ కాజల్

### టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి తన ఫేవరేట్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ అని తెలిపాడు. తాజాగా పాన్ ఇండియా మూవీ ఛాంపియన్ ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న నితీష్ కుమార్ రెడ్డి.. ఈ విషయాన్ని వెల్లడించాడు. ఛాంపియన్ హీరో రోషన్‌తో నితీష్ కుమార్ రెడ్డి సరదాగా చిట్ చాట్ చేశాడు. ఈ మూవీకి సంబంధించిన విషయాలతో పాటు వ్యక్తిగత ఇష్టాల గురించి మాట్లాడుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా ఛాంపియన్ రిలీజ్ అవుతుందని రోషన్ చెప్పగా.. తప్పకుండా చూస్తానని నితీష్ తెలిపాడు. ఈ ఇద్దరు స్నేహితుల్లా చాలా సరదాగా చిట్ చాట్ చేశారు.రోషన్ అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం రూపొందించిన పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మించాయి. ఇప్పటికే ఈ మూవీ టీజర్, ట్రైలర్, సాంగ్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ లభించింది.విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా నితీష్ కుమార్ రెడ్డి వ్యవహరిస్తున్నాడు. బెంగళూరు వేదికగా ఢిల్లీతో ఆంధ్ర టీమ్ తొలి మ్యాచ్ ఆడుతుంది. ఢిల్లీ తరఫున కోహ్లీతో పాటు రిషభ్ పంత్ బరిలోకి దిగాడు.

...........

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com